క్లుప్తంగా

వైభవంగా అష్టదళ పాద పద్మారాధన పూజ

చిల్పూరు: చిల్పూరుగుట్ట బుగులు వెంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం స్వామివారికి వైభవంగా అష్టదళ పాదపద్మారాధన పూజ నిర్వహించారు. ప్రధాన అర్చకుడు బ్రాహ్మణపల్లి రవీందర్‌శర్మ, అర్చకులు సామిత్రి రంచార్యులు, సముద్రాల కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ ఈఓ భాగం లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో 108 బంగారు పుష్పాలతో స్వామి వారికి పూజలు చేశారు. కమిటీ చైర్మన్ మామిడాల యాదవరెడ్డి–జానకి, పలువురు దంపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవ పూజలు

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని తిరుమలనాథ స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతీ రోజూ పూజలు కొనసాగుతున్నాయి. మంగళవారం స్వామివారికి ఉదయం మంగళవాయిద్యాలు, సుప్రభాత సేవ తదితర పూజలు నిర్వహించారు. అర్చకులు పూజలు చేపట్టగా భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన నాయకులు



బచ్చన్నపేట: రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్నికైన కిసాన్ సెల్ రాష్ట్ర చైర్మన్ సుంకటి అన్వేష్‌రెడ్డిని కాంగ్రెస్ మండల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో మంగళవారం ఆయనను కలిసి శాలువాలతో సన్మానం చేశారు. కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పిన్నింటి నారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వంచ వెంకట్‌రెడ్డి, నాయకులు మహేందర్‌రెడ్డి, రాజిరెడ్డి, నరేష్‌గౌడ్ పాల్గొన్నారు.

టూరిజం చైర్మన్‌ను..

రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ చైర్మన్‌గా నియమితులైన పటేల్ రమేష్‌రెడ్డిని హైదరాబాద్‌లో మండలంలోని కేసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నాయకులు ఇమ్మడి జితేందర్‌రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు.

ఎస్సైని..



రఘునాథపల్లి: నూతనంగా బాధ్యతలు చేపట్టిన స్థానిక ఎస్సై దూదిమెట్ల నరేష్‌ను మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సైకి పుష్పగుచ్ఛాలు, శాలువాలతో అభినందించారు. కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నరేష్, లక్ష్మయ్య, యాదగిరి, నరేష్, మహేష్ ఉన్నారు.

పత్రాలు అందజేయండి

బచ్చన్నపేట: అర్హులు జీరో బిల్లు కోసం గ్రామ పంచాయతీ కార్యదర్శులకు సంబంధిత పత్రాలు అందజేయాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నా కొందరికి జీరో బిల్లు రాలేదని ఆందోళన చెందొద్దన్నారు. బిల్లులు వచ్చిన వారు ఆధార్‌కార్డు, కరెంటు బిల్లు, ప్రజాపాలన రశీదు, రేషన్ కార్డు జిరాక్స్‌లను కార్యదర్శులకు అందించాలని అన్నారు. వారు వెంటనే అప్‌లోడ్ చేస్తారని తెలిపారు.

శతాధిక వృద్ధురాలి మృతి



వెంకటరామక్క (ఫైల్)

చిల్పూరు: మల్కాపూర్ గ్రామానికి చెందిన బోగి వెంకటరామక్క బోయ (105) సోమవారం రాత్రి మృతి చెందింది. ఈ సందర్భంగా గ్రామంలో విషాదం నెలకొంది. బాధిత కుటుంబాన్ని పలువురు పరామర్శించారు.

వాహనాల తనిఖీ

జనగామ రూరల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం రాత్రి పెంబర్తి చెక్ పోస్ట్ వద్ద సీఐ రఘుపతిరెడ్డి ఆధ్వర్యంలో వాహనాలను పోలీసులు తనిఖీ చేశారు. ఎస్సై సృజన్, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నపెండ్యాలలో..

చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాల గ్రామంలోని చిన్నపెండ్యాల–తరిగొప్పుల రహదారిలో మంగళవారం ఎస్సై ముత్యం రాజేందర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బలగాలు వాహనాలను ముమ్మరంగా తనిఖీలు చేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సీపీ ఆదేశాలతో తనిఖీలు చేపట్టామని తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

జనగామ రూరల్: పట్టణంలో పేకాట ఆడుతున్న 9 మందిని మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టణంలోని గురుద్వార్ సమీపంలో పలువురు పేకాట ఆడుతున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారంతో ఏఎస్సై మనోహర్, పీసీ భాస్కర్ పెట్రోలింగ్‌లో భాగంగా అక్కడికి వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 3,290 నగదు, 7 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

పోషకాహారంతో ఆరోగ్యం



స్టేషన్‌ఘన్‌పూర్: కూలీలకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



జఫర్‌గఢ్: మాట్లాడుతున్న జెడ్పీటీసీ బేబి



తరిగొప్పుల: అబ్దుల్‌నాగారంలో..



దేవరుప్పుల: సింగరాజుపల్లిలో..

జఫర్‌గఢ్: పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జెడ్పీటీసీ సభ్యురాలు ఇల్లందుల బేబి శ్రీనివాస్ అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని తిమ్మంపేట గ్రామంలోని ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ సూపర్ వైజర్ తాటికొండ అనిత అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా బేబి పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ సెంటర్లలో మెను ప్రకారం అధిక పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలన్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలు పోషక విలువతో కూడిన ఆహారాన్ని తీసుకోవడంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రాణి, నర్మద, శాంతతో పాటు ఆయాలు, గర్భిణులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రతీ ఒక్కరూ రోజూ ఆహారంలో పోషకాహారం తీసుకోవాలని, తద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ టీచర్ మునిగాల రాణి అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చేపడుతున్న పోషణ పక్షోత్సవాల్లో భాగంగా ఘన్‌పూర్‌కు చెందిన అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో డివిజన్‌కేంద్రంలో వ్యవసాయ కూలీలు, ఉపాధి హామీ కూలీలకు మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పోషకాహారం, తాగునీరు, పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ఉన్నంతలో పోషకాహారం తీసుకోవాలని, రోజూ తీసుకునే ఆహారంలో చిరుధాన్యాలను జోడించాలన్నారు. సీజన్‌వారీగా లభించే పండ్లు, ఆకుకూరలు, మొలకెత్తిన విత్తనాలు తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీలు మునిగాల ప్రభ, చింత స్వరూప, గాదె సునీత, మారెడుపాక రాణి, మాధవి, సరోజన, లలిత, లిఖితభవాని పాల్గొన్నారు.

తరిగొప్పుల: మండలంలోని బొంతగట్టునాగారం, అక్కరాజుపల్లి, బంజరుపల్లి, నర్సాపూర్, తరిగొప్పుల అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకు కూరలు, కూరగాయలు, చిరుధాన్యాలపై గర్భిణులు, బాలింతలు, కిషోర బాలలకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు భాగ్యలక్ష్మి, పుష్పలత, రజిత, రమ, అంజమ్మ, లక్ష్మి, వనిత, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

దేవరుప్పుల: మండలంలోని సింగరాజుపల్లి, అప్పిరెడ్డిపల్లె, కోలుకొండ, నల్లకుంటతండా, ధరావత్ తండా, బంజర, లకావత్‌తండాలో ఐసీడీఎస్ అంగన్‌వాడీల ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోషికాహార ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు.

ఎన్నికల విధులు బాధ్యతగా నిర్వర్తించాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ డీఎస్ వెంకన్న

స్టేషన్‌ఘన్‌పూర్: ఎన్నికల విధుల్లో అందరూ అప్రమత్తంగా, బాధ్యతగా పనిచేయాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఘన్‌పూర్ ఆర్డీఓ డీఎస్ వెంకన్న అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నియోజవకర్గంలోని వివిధ మండలాలకు చెందిన తహసీల్దార్లు, సెక్టోరియల్ అధికారులతో మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలకు సెక్టోరియల్ అధికారులు ఏర్పాట్లను పరిశీలించాలని, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల గురించి స్వయంగా పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అందరూ సమన్వయంతో బాధ్యతగా పనిచేస్తూ ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలని ఆయన కోరారు. ఘన్‌పూర్ తహసీల్దార్ వెంకటేశ్వర్లుతో పాటు వివిధ మండలాల తహసీల్దార్లు, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

బీసీలకు వాటా సాధించే వరకూ పోరాటం



రఘునాథపల్లి: చట్టసభల్లో బీసీలకు వాటా సాధించే వరకూ పోరాటం ఆగదని ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్ అన్నారు. ఆల్ ఇండియా ఓబీసీ జాక్ ఆధ్వర్యంలో చేపట్టిన బీసీల వాటా మహా పాదయాత్ర మంగళవారం రఘునాథపల్లికి చేరుకుంది. వారికి మాజీ జెడ్పీటీసీ మారుజోడు రాంబాబు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జాక్ నాయకులు నరేందర్, సిద్దేశ్వర్లు, నరేందర్‌గౌడ్ మాట్లాడుతూ తర తరాలుగా సమాజ హితం కోసం ఎన్నో సేవలు చేస్తున్న బీసీలు దేశంలో జరిగిన అన్ని పోరాటాల్లో అసువులు బాసి త్యాగాలు చేశారని, అలాంటి బీసీలకు నేడు అధికారం, ఆత్మగౌరవం లేక బలిదానాలు చేసుకుంటున్నారని అన్నారు. జాక్ నాయకులు పటేల్ వనజ, వెలుగు వనిత, ఏటిగడ్డ అరుణ, బిక్షపతిగౌడ్, శ్రీహరిగౌడ్, లింగమూర్తి, అరుణ, విమల, బాలస్వామి, శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, అజయ్‌పటేల్, కుమార్, రాంప్రసాద్, నరహరి, సుజాత, రమాదేవి, విశ్వపతి, రాంనర్సయ్య, సతీష్, విజయ్‌కుమార్, ఆంజనేయులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటా



పేషెంట్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా

జనగామ: జనగామ నియోజకవర్గ ప్రజలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటాను.. ఎవరూ అధైర్యపడొద్దని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి భరోసా ఇచ్చారు. మంగళవారం ఘట్‌కేసర్‌లోని నీలిమ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నియోజకవర్గ రోగుల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుని వైద్యులతో మాట్లాడారు. డాక్టర్లు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ మరింత మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆరోగ్య పరంగా ఎటువంటి ఇబ్బందులు వచ్చినా, నీలిమ ఆస్పత్రిలో ఉచితంగా వైద్య సేవలు అందిస్తామని, ఎవరూ కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



స్టేషన్‌ఘన్‌పూర్: పరామర్శిస్తున్న శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెం గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ రాంనర్సయ్య తండ్రి ఎన్నకూస (తీగల) నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా, ఎమ్మెల్యే కడియం శ్రీహరి మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎం నాయకుడిగా, గ్రామ మాజీ ఉపసర్పంచ్‌గా నర్సయ్య పలు కార్యక్రమాలు చేపట్టారని, ఆయన మృతి విచారకరమన్నారు. అదేవిధంగా ఇప్పగూడెంలో గొడిశాల మల్లయ్య, సముద్రాలలో తాటికొండ ఎల్లమ్మ, అక్కపెల్లిగూడెంలో చెన్నోజు వజ్రమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబాలను ఎమ్మెల్యే కడియం పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు బెలిదె వెంకన్న, తోట వెంకన్న, మండపురం ఎల్లగౌడ్, గన్ను నర్సింహులు, అజయ్‌రెడ్డి ఉన్నారు.

చిల్పూరులో..

చిల్పూరు: మండల కేంద్రంలో వడి కొంరయ్య, వడి కొంరమ్మ, నష్కల్ గ్రామానికి చెందిన సిరికొండ నర్సయ్య, అరూరి మల్లయ్య అనారోగ్యంతో మృతి చెందారు. కాగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంపీపీ సరితబాలరాజు తదితరులు ఉన్నారు.

నష్కల్‌లో..

నష్కల్ గ్రామానికి చెందిన అరూరి మల్లయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకుని పలువురు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జ్ తీగల మహేందర్, ఎంపీటీసీ పాశం శిరీష సురేష్, చిల్పూరు ఆలయ డైరెక్టర్ జక్కుల రాజశేఖర్, నాయకులు శాగంటి మణి, నల్ల ఎల్లయ్య, ఎడ్ల యాదయ్య, జక్కుల రాజయ్య ఉన్నారు.

‘క్రమశిక్షణ ఉల్లంఘిస్తే వేటు తప్పదు’



మాట్లాడుతున్న సోమనర్సయ్య

కొడకండ్ల: కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏ స్థాయిలో ఉన్నా పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరిస్తూ క్రమశిక్షణ ఉల్లంగిస్తే వేటు తప్పదని కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి నూనెముంతల సోమనర్సయ్య అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం క్రమశిక్షణతో పనిచేసే వారికి సముచిత స్థానం, గుర్తింపు దక్కుతుందని, వ్యతిరేకంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, పార్టీకి సంబంధం లేని విషయాలను వ్యక్తిగతంగా తెల్చుకోవాలే తప్ప పార్టీకి సంబంధం అంటగడుతూ విమర్శలు, ఆరోపణలు చేస్తే క్షమించేది లేదన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరిని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డిలు గుర్తించి ప్రాధాన్యతనిస్తున్న క్రమంలో ప్రతి ఒక్కరు క్రమశిక్షణతో పార్టీ విధేయులుగా పనిచేయాలని కోరారు. దేవస్థాన డైరెక్టర్ రాజు, పట్టణ అధ్యక్షుడు రవీందర్, అంజయ్య, భిక్షపతి, రమేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా శ్రీరాములు



శ్రీరాములును అభినందిస్తున్న ఝాన్సీరెడ్డి

దేవరుప్పుల: కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడిగా నీర్మాలకు చెందిన నల్ల శ్రీరాములును ఎన్నుకున్నారు. మంగళవారం తొర్రూరు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి పర్యవేక్షణలో ప్రత్యేక సమావేశంలో నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నల్ల శ్రీరాములు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో కార్యకర్తలను సమీకరించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. తన నియమాకానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులకు, మండల ముఖ్య నాయకులకు, పార్టీ గ్రామాల అధ్యక్షులు తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మామిడాల తిరుపతిరెడ్డి వంగాల మల్లారెడ్డి, సీనియర్ నాయకులు కాసారపు ధర్మారెడ్డి, తోటకూరి పాండు, ఆవుల సురంజన్ రెడ్డి, బీసీ,ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు కాడబోయిన గణేష్, నాగరాజు, సురేష్ బాబు పాల్గొన్నారు. కాగా, మండల నూతన కమిటీ ఎన్నిక తనకు తెలియకుండా ఎన్నుకున్నారని ప్రస్తుత మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి పేర్కొన్నారు.

పల్లెల్లో జాజిరి సందడి

కొడకండ్ల: హోళీని పురస్కరించుకొని చిన్నారుల జాజిరి సందడి గ్రామాల్లో నెలకొంది. ఈ నెల 25న హోళీ పండుగ నేపథ్యంలో వారం రోజుల ముందు నుంచే చిన్నారులు వీధుల్లో జాజిరి ఆట, పాటలతో సందడి చేస్తున్నారు.

యువకుడి అదృశ్యం



సాయికృష్ణ

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్ కేంద్రానికి చెందిన గుండు సాయికృష్ణ(26) మూడు రోజుల నుంచి కనిపించడం లేదని అతడి తాత నర్సయ్య స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశాడు. వంశీకృష్ణ ఈనెల 16న బంధువుల వివాహానికి వెళ్తానని ఇంటిలో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. రాత్రి అయినా అతడు ఇంటికి రాకపోవడంతో బంధువులను అడుగగా వివాహానికి రాలేదని చెప్పారు. దాంతో తెలిసిన వారి వద్ద, బంధువుల ఇళ్లలో విచారించినా ఆచూకి తెలియలేదు. దాంతో మంగళవారం మనువడి ఆచూకి కోసం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నర్సయ్య ఫిర్యాదు చేశాడు. కాగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ముస్క రాజు తెలిపారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న డీటీ జగన్

జనగామ: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అర్హులైన ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ జగన్ సూచించారు. నెహ్రూ యువ కేంద్రం వరంగల్ ఆధ్వర్యంలో తహసీల్దార్ వెంకన్న సహకారంతో మంగళవారం తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వంశీకృష్ణ, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ జ్యోతి, ఎన్నికల అసిస్టెంట్ ఎల్లయ్య, జిల్లా రూరల్ డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, కార్యదర్శి ఆగమల్లు ముస్తఫా, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు స్వర్ణ ప్రాసన



చిన్నారులతో డాక్టర్ అంజిరెడ్డి

జనగామ: జిల్లా కేంద్రం హైదరాబాద్ రోడ్డు వేద ఆయుర్వేదిక్ పంచకర్మ, వెల్నెస్ సెంటర్‌లో మంగళవారం చిన్నారులకు స్వర్ణ ప్రాసం ఉచితంగా వేశారు. ఆస్పత్రి డాక్టర్ అంజిరెడ్డి ఆధ్వర్యంలో 0–16 ఏళ్ల లోపు 200 మంది పిల్లలకు స్వర్ణప్రాసం వేసిన తర్వాత మాట్లాడారు. ప్రతినెలా పుష్యమి నక్షత్రం రోజు ఉదయం 7 నుంచి 8 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. స్వర్ణ ప్రాసన పిల్లల ఎదుగుదలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఆయుర్వేద వైజ్ఞానికులు సుశ్రుతుడు, చరకుడు గొప్పదనాన్ని ప్రాజెక్టు రూపంలో తయారు చేసి వచ్చేనెల పుష్యమి నక్షత్రం రోజు ప్రదర్శించిన వారిలో ముగ్గురికి బహుమతులను అందజేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో డాక్టర్లు తనూజ, మౌనిక, సిబ్బంది అర్పిత, వెంకటేశ్, గోపి, శివ, లలిత, సాయి తదితరులు పాల్గొన్నారు.

మల్లు స్వరాజ్యం ఆశయాలు కొనసాగిద్దాం



రఘునాథపల్లి: నివాళులర్పిస్తున్న నాయకులు



పాలకుర్తిలో..

రఘునాథపల్లి: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, మాజీ ఎమ్మెల్యే మల్లు స్వరాజ్యం ఆశయాలను కొనసాగిద్దామని సీపీఎం మండల కార్యదర్శి గంగాపురం మహేందర్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలకేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పార్టీ నాయకులతో కలిసి పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం కమ్యూనిస్టుల నాయకత్వంలో సాగిన వీర తెలంగాణ పోరాటంలో ఆమె ముఖ్య భూమిక పోషించారన్నారు. కడారి అంజనేయులు, శాగ సాంబరాజు, కడారి యాదగిరి, ఎండి బాషా, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం

పాలకుర్తి: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం అని సీపీఎం జిల్లా నాయకులు చిట్యాల సోమన్న, సోమ సత్యం అన్నారు. మంగళవారం పాలకుర్తి రాజీవ్ చౌరస్తాలో మల్లు స్వరాజ్యం రెండో వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం కమ్యూనిస్టుల నాయకత్వంలో మల్లు పోరాటాలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మాసంపల్లి నాగయ్య, సీఐటీయూ నాయకులు ఏనుగుతల వెంకన్న, దండిగ పెద్దాపురం, రాచర్ల రాజు పాల్గొన్నారు.

నివాళి

జఫర్‌గఢ్: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం వర్ధంతిని ఐద్వా ఆధ్వర్యంలో మండలంలోని తమ్మడపల్లి (జి) గ్రామంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి షబానా, రాపర్తి రజిత, ఉప్పునూతల ఎల్లమ్మ, యశోద, శృతి, సంధ్య, రాపర్తి యాకలక్ష్మి, హైమావతి, కోమల పాల్గొన్నారు.

ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రులు

కొడకండ్ల: తమ మిత్రురాలు భర్తను కోల్పోయి ఆర్థిక ఇబ్బందుల్లో ఉండటంతో స్పందించిన స్నేహితులంతా కలిసి రూ.69 వేలు విరాళాలు పోగు చేసి మంగళవారం అందజేశారు. ఏడునూతుల గ్రామానికి చెందిన మల్లు హైమావతి భర్త మృతి చెందడంతో 1992 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన మిత్రులు తమవంతుగా చేయూతనివ్వాలనే సంకల్పంతో విరాళాన్ని పోగు చేసి అందజేశారు.

మానవ సేవే మాధవ సేవ



కంటి అద్దాలు అందజేస్తున్న భాస్కర్‌రెడ్డి

బచ్చన్నపేట: మానవ సేవే మాధవ సేవ అని, వాస్విక్ ఫౌండేషన్ చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎస్సై కంకల సతీష్ అన్నారు. మంగళవారం మండలంలోని రామచంద్రాపూర్ గ్రామంలో వాస్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మల్టీ ఉచిత మెగా వైద్యశిబిరాన్ని రైతు వేదిక భవనంలో నిర్వహించారు. ఈ క్యాంపును ఎస్సై ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి పలు పరీక్షలను చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ క్యాంపులో చాలా రకాల పరీక్షలను నిర్వహించారని, ఇలాంటి ప్రజా ఉపయోగ పనులు ఫౌండేషన్ సభ్యులు చేయడంతో చాలా మందికి ప్రయోజనం చేకూరుతుందన్నారు. కాగా, 560 మందికి పలురకాల పరీక్షలను చేసి అవసరమున్న వారికి ఉచితంగా మందులను అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ నిడిగొండ నరేష్‌కుమార్, వైస్ చైర్మన్ నూకల భాస్కర్‌రెడ్డి, కిసాన్‌సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ నిడిగొండ శ్రీనివాస్, నాయకులు నూకల నర్సిరెడ్డి, దునుకు వెలాద్రి, ఆముదాల మల్లారెడ్డి, ఇంద్రసేనారెడ్డి, భూపాల్‌రెడ్డి, వడ్డెపల్లి మల్లారెడ్డి,ఉప్పలపాటి హేమంత్, డా. కెన్నడీ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై కళాజాతా



అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం సభ్యులు

తరిగొప్పుల: తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో సైబర్ నేరాలపై కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక దురాచారాలు, మూఢనమ్మకాలు, సైబర్ నేరాలపై పాటల రూపంలో కళాకారులు అవగాహన కల్పించారు. అనంతరం ఎస్సై అయ్యాల శ్వేత మాట్లాడుతూ ప్రాచీన కాలంలో భౌతిక దాడులు చేసి దొంగతనాలకు పాల్పడేవారని, ప్రస్తుత కాలంలో టెక్నాలజీని ఉపయోగించి సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని అన్నారు. అలాంటి వారిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. లక్ష్మణ్ నాయక్, కళాజాత బృందం సభ్యులు శ్రీని వాస్, బాలయ్య, బావండ్లపల్లి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల రాస్తారోకో..



దేవరుప్పుల: కాంగ్రెస్ దేవరుప్పుల మండల ప్రస్తుత అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తిని అకారణంగా తొలగించడాన్ని నిరసిస్తూ జనగామ–సూర్యాపేట రహదారిపై మంగళవారం రాత్రి కాంగ్రెస్ నాయకులు, యువకులు బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు పారుపెల్లి శ్రీనివాస్, తోటకూరి రమేష్ మాట్లాడుతూ అంకితభావంతో అనుక్షణం పార్టీ కోసం పనిచేసిన కృష్ణమూర్తిని పాలకుర్తి నియోజక వర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, పాలకుర్తి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అకారణంగా తొలగించి ప్రస్తుతం జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడిగా ఉన్న నల్ల శ్రీరాములను ఏకపక్షంగా ఎన్నుకోవడాన్ని తీవ్రంగా ఖండించారు. ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు సజ్జన్, సీనియర్ నాయకులు మహేందర్‌జీ, రమేష్, నర్సయ్య, పలు గ్రామాల అధ్యక్షులు పాల్గొన్నారు.